# సాక్షి
## రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023






### రైల్వేలైన్ పరిశీలన

వేములవాడఅర్బన్: నాంపల్లి, అనుపురం శివారులోని రైల్వేలైన్‌లో పోతున్న ఇళ్లను, ప్లాట్లను అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ గురువారం పరిశీలించారు.



### ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి గురువారం 1,536 క్యూసెక్కుల నీరు తరలుతోంది. ప్రస్తుతం 20.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
29.0/25.0

### వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

## న్యూస్‌రీల్

### సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే



సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గురువారం వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబుతోపాటు ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### రాజన్న సేవలో ఎస్‌యూ వీసీ



వీసీ గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ పర్యవేక్షకులు

వేములవాడ: రాజన్నను కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. పర్యవేక్షకులు అల్లి శంకర్ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ఆశీర్వచనం గావించారు.

### అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న నీరటి శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): ఓటాబందీ వ్యవస్థను కొనసాగింపునకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తారన్న తప్పుడు సమాచారంతో తమను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సుంకరీ ఇస్సాదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి ఠాణా ఆవరణలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇస్సాదారులకు వ్యతిరేకంగా ఇచ్చిన జీవో 81 రద్దు చేసి ఓటాబందీ విధానం ప్రవేశపెట్టాలని కోరారు. నాయకులు కాపిల్ల స్వామి తదితరులు ఉన్నారు.

### వేములవాడలో వక్ఫ్ భూముల పరిశీలన



వేములవాడ: వేములవాడ పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో వక్ఫ్ భూములను గురువారం రెవెన్యూ, వక్ఫ్‌బోర్డు, స్థానిక ముస్లిం కమిటీ నాయకులు గురువారం పరిశీలించారు. చెక్కపల్లిరోడ్డులోని సర్వే నంబర్ 107లో గల వక్ఫ్ భూమిని సర్వేయర్ రాజేందర్ సర్వే చేశారు. వక్ఫ్‌భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ నజీమొద్దీన్, వక్ఫ్‌బోర్డు సర్వేయర్ సుజాద్ అలీఖాన్, వాజీద్, అక్బర్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ అర్షద్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు బాబూన్, టౌన్ కమిటీ సెక్రటరీ మహమ్మద్ వలీ, నాయకులు అంజాద్‌పాషా, యూసుఫ్, శకీల్, వకీల్, ఇబ్రాహీం పాల్గొన్నారు.

### పశువులకు టీకాలు వేయించాలి



బోయినపల్లి(చొప్పదండి): పశువులకు సీజన్లవారీగా టీకాలు వేయిస్తే ఆరోగ్యంగా ఉంటాయని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కొమురయ్య పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లిలో గురువారం గాలికుంటువ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. గాలికుంటు వ్యాధి చికిత్స వ్యయప్రయాసలతో కూడిందని, ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు. వెంకట్రావుపల్లి, కొత్తపేటల్లో 270 పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి రమేశ్ తెలిపారు. సర్పంచులు బూర్గుల నందయ్య, ల్యాద నవిత, వైద్యుడు అశోక్‌కుమార్, సిబ్బంది మధుమిత, నరేందర్, శ్రీవాణి పాల్గొన్నారు.

---

ఈ చిత్రం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని రాపెల్లివాగు వంతెన వద్ద గల గుంతల రోడ్డు. నూతనంగా నిర్మించిన ఈ రోడ్డు వర్షం నీటితో గుంతలుగా మారింది. మోకాలు లోతు గుంతలు పడ్డ ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. వాహనాలు పాడవుతున్నాయి. ఆటోడ్రైవర్లు, ప్రయాణికులు నొప్పులతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వాహనాలు మరమ్మతులు చేసుకోవడానికి అప్పులు చేయాల్సి వస్తోందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క రాపెల్లివాగు వంతెన వద్దనే కాకుండా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 56 రోడ్ల పరిస్థితులు ఇలాగే ఉన్నాయి.



# వెన్నుపూస కదులుతోంది !

- అడుగుకో గుంత.. అధ్వానంగా రహదారులు
- వర్షం నీటితో కనిపించని గుంతలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- డిస్క్ సమస్యలతో జనం ఇబ్బంది



గుంతలుపడ్డ నారాయణపూర్‌–బందలింగంపల్లి రోడ్డు



ఇతను పెద్దవేని రాజుయాదవ్. ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్పూర్‌కు చెందిన ఆటోడ్రైవర్. ఇతను నిత్యం అల్మాస్‌పూర్ నుంచి ఎల్లారెడ్డిపేటకు ప్రయాణికులను తరలిస్తూ ఉపాధి పొందుతున్నాడు. రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారడంతో ఆటో పాడవడంతోపాటు వెన్నునొప్పి వచ్చింది. ఆస్పత్రిలో చూయించుకుంటే డిస్క్ ప్రాబ్లమ్ వచ్చిందని వైద్యులు తెలిపారు. రోజు ఆటో నడిపితే వచ్చే ఆదాయం కంటే ఒళ్లు నొప్పుల మందులకే ఎక్కువ డబ్బులు ఖర్చవుతున్నాయని వాపోతున్నాడు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలోని మండల కేంద్రాల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. మోకాలు లోతు గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు పాడవడంతోపాటు ప్రయాణికులు, డ్రైవర్ల వెన్నుపూసలు కదులుతున్నాయి. చాలా మంది డిస్క్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ సమస్య చాలా మందిలో వెలుగుచూస్తుంది. జిల్లా వ్యాప్తంగా 56 రహదారులు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. వర్షం పడితే మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నడుం నొప్పులతో ఇబ్బంది

జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట, వీర్నపల్లి, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, గంభీరావుపేట మండల కేంద్రాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి లోతు తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతల రోడ్లను బాగు చేయాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గుంతలు పడ్డ రోడ్లపై ప్రయాణిస్తున్న వారిలో 75 శాతం మంది నడుం నొప్పులతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ప్రధానంగా ఆటో, ట్రాక్టర్ల డ్రైవర్లు డిస్క్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గర్భిణులను ఆస్పత్రులకు తీసుకెళ్తుంటే వారు అనుభవించే నరకం చూడలేకపోతున్నామని ఆటోడ్రైవర్లు తెలుపుతున్నారు. ఒక్క నడుం నొప్పి కాకుండా, వెన్నుపూస కదలడం, డిస్క్, పక్కటెముకలు, మోకాళ్లు, మెడలు పట్టుకోవడం వంటి సమస్యలతో నరకం అనుభవిస్తున్నారు. ఎమ్మారై, సీటీస్కాన్, ఎక్స్‌రే, ఇతర పరీక్షలతో కలిసి ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో ఆర్థికంగా కుదేలవుతున్నారు.

### పట్టించుకోని అధికారులు

ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రోడ్లు గుంతలు పడ్డాయి. రోడ్ల దుస్థితిపై గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేసే అవకాశాలున్నప్పటికీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గుంతల రోడ్ల దుస్థితిపై మంత్రి కేటీఆర్ స్పందించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

### తరచూ రిపేర్లు



రోడ్లు మంచిగా లేక ఆటో తరచూ రిపేర్‌కు వస్తుంది. ఆటోను నమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న. రిపేర్‌కు అయ్యే ఖర్చులతో కుటుంబం గడవడం కష్టమైతుంది. ఆటో రిపేరే కాకుండా నాక్కూడ నడుం నొప్పులు వస్తున్నాయి. గర్భిణులను ఆస్పత్రులకు తరలించే సమయంలో చాలా ఇబ్బంది పడుతున్నారు. – అజయ్, ఆటోడ్రైవర్, బందలింగంపల్లి

### డిస్క్ ప్రాబ్లమ్స్ వస్తున్నాయి

తరచూ ప్రయాణం చేసే వారిలో ఎక్కువగా డిస్క్ ప్రాబ్లమ్స్ వస్తున్నాయి. ప్రాబ్లమ్ గుర్తించేందుకు ఎమ్మారై లాంటి పరీక్షలకు కరీంనగర్ తరలిస్తున్నాం. తరచూ ప్రయాణించే వారు మెడ, నడుం బెల్టులను పెట్టుకోవాలి. దీని ద్వారా దీర్ఘకాలిక సమస్యలు రాకుండా నిరోధించవచ్చు. నొప్పుల ఉపశమనానికి ఫిజియోథెరపీకి పంపిస్తున్నాం. అలా కూడా నయం కాకపోతే వెన్నుపూస ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. – సునీల్, ఆర్థోపెడిక్ వైద్యుడు, ఎల్లారెడ్డిపేట

---

# వైన్స్ రిజర్వేషన్లు ఖరారు

- జిల్లాలో 48 మద్యం దుకాణాలు
- గౌడ కులస్తులకు 9, ఎస్సీలకు 5
- నేడు నోటిఫికేషన్.. వెంటనే దరఖాస్తుల స్వీకరణ
- ఎన్నికల వేళ టెండర్లు పెరిగే అవకాశం



రిజర్వేషన్‌ల కేటాయింపుల కోసం లాటరీ తీస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులు

సిరిసిల్లక్రైం: జిల్లాలో మద్యం దుకాణాల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. ఈ సారి ఎలక్షన్లు ఉండడంతో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు భారీగానే టెండర్లు వస్తాయని అంచనా. 2023–25 సంవత్సరానికి వైన్స్ నిర్వహణకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేయడంతోపాటు వెంటనే టెండర్లు స్వీకరించనున్నారు. జిల్లాలోని 48 వైన్స్‌లలో గౌడ కులస్తులకు, ఎస్సీలకు రిజర్వేషన్‌లు పూర్తి చేశారు.

**14 షాపులను రిజర్వ్ చేసిన ఆబ్కారీశాఖ**

జిల్లాలో 48 వైన్స్‌లలో 9 షాపులు గౌడ కులస్తులకు, 5 షాపులను ఎస్సీలకు కేటాయించారు. రిజర్వేషన్ ఉన్న షాపుల నంబర్లను గురువారం లాటరీ విధానంలో ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా ఎక్సైజ్ అధికారి పంచాక్షరి సమక్షంలో పూర్తిచేశారు.

ఎస్సీలు : సిరిసిల్లటౌన్(షాపు 4), ఎల్లారెడ్డిపేట(38), గంభీరావుపేట(36), సిరిసిల్లటౌన్(5), గొల్లపల్లి(44)ని కేటాయించారు.

గౌడ కులస్తులు : ముస్తాబాద్(షాపు 42), వేములవాడ(25), కొదురుపాక(12), సిరిసిల్లటౌన్(7), గొల్లపల్లి(43), చందుర్తి(33), ఇల్లంతకుంట(15), తంగళ్లపల్లి(10), వేములవాడ(27) రిజర్వ్ చేశారు.

**రూ.8,031 కోట్లు తాగేశారు**

జిల్లా వ్యాప్తంగా ఉన్న వైన్స్‌లలో రెండేళ్లకాలానికి మరో నాలుగు నెలలు ఉండగా ఇప్పటికే మనోళ్లు రూ.9,031 కోట్ల మద్యాన్ని తాగేసినట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. సిరిసిల్లలోని 7 హిల్స్ వైన్స్‌లో అత్యధికంగా రూ.24.82కోట్ల వ్యాపారం, అత్యల్పంగా రుద్రంగిలోని వైన్స్‌లో రూ.7.82కోట్ల వ్యాపారం జరిగింది. ప్రస్తుతం నిర్వహించే దరఖాస్తులలో సిరిసిల్ల పట్టణంలోని జీఎస్ 1 షాపుపై అత్యధికంగా దరఖాస్తులు వస్తాయని, గతంలోనూ ఈ షాపు అత్యధికంగా 35 మంది దరఖాస్తులు వేసి ప్రభుత్వ ఖజానాకు ఫీజు రూపంలో రూ.70 లక్షలు ముట్టజెప్పారు. రుద్రంగి వైన్స్‌కు పది మంది మాత్రమే దరఖాస్తు చేసినట్లు గణాంకాలున్నాయి.

**వివరాలు ఇలా..**

| | |
|---|---|
| నోటిఫికేషన్ | : ఆగస్టు 4 |
| దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం | : ఆగస్టు 4 |
| దరఖాస్తుల గడువు | : ఆగస్టు 18 |
| డ్రా ద్వారా ఎంపిక | : ఆగస్టు 21 |
| మొదటి విడత ఫీజు చెల్లింపు | : ఆగస్టు 21, 22 |
| వైన్స్ స్టాక్ | : నవంబర్ 30 |
| వైన్స్ ప్రారంభం | : డిసెంబర్ 1 |

**గతంలో దరఖాస్తుల ఆదాయం రూ.18.88 కోట్లు**

వైన్స్ అధికారికంగా నిర్వహించేందుకు 2021లో చేపట్టిన టెండర్ ప్రక్రియ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న 48 దుకాణాలకు 944 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున మొత్తం ప్రభుత్వ ఖజానాకు రూ.18.88 కోట్ల ఆదాయం చేరింది. ఈసారి ఎన్నికలు రానుండడంతో గతం కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఒకసారి దరఖాస్తుదారుడి చెల్లించిన ఫీజును తిరిగి ఇవ్వబోమనే విషయాన్ని గమనించాలని తెలిపారు.

# లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



అధికారులతో సమీక్షిస్తున్న న్యాలకొండ అరుణ

సిరిసిల్ల: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలో గురువారం గడిచిన వారం రోజుల నుంచి కురిసిన వర్షాలకు జరిగిన నష్టం, దిద్దుబాటు చర్యలపై మండల, జిల్లా స్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించారు. నష్టపోయిన రోడ్లు, పంటల వివరాలను అధికారుల నుంచి తెప్పించుకుని పరిశీలించారు. పాక్షికంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, కాల్వల మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పూర్తిచేస్తున్నట్లు వెల్లడించారు. వర్షాకాలంలో వ్యాధులు ఎక్కువగా ప్రబలకుండా వైద్యాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ ట్యాంకులను పరిశుభ్రం చేసి నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, ఈఈపీఆర్ సూర్యప్రకాశ్, ఈఈ ఇరిగేషన్ శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, ఈఈ ఆర్‌అండ్‌బీ శ్యామ్, డీఏవో భాస్కర్, ఈఈ మిషన్ భగీరథ జానకి పాల్గొన్నారు.

---

# అల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులకు చెక్

- జెడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు అరుణ, కళ



పిల్లలకు మాత్రలు వేస్తున్న అరుణ, జిందం కళ

సిరిసిల్లటౌన్: అల్బెండజోల్ మాత్రలతో పిల్లల్లో నులిపురుగులకు చెక్ పెట్టవచ్చని జెడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు న్యాలకొండ అరుణ, జిందం కళ పేర్కొన్నారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలతో పిల్లలు రక్తహీనత బారిన పడకుండా ఉంటారన్నారు. ఒకటి నుంచి పందొమ్మిదేళ్లలోపు పిల్లలకు ప్రతి ఆరు నెలలకోసారి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం

- డీఈవో రమేశ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

బోయినపల్లి/వేములవాడఅర్బన్: ప్రాథమిక స్థాయి విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని తొలిమెట్టు రాష్ట్ర కో–ఆర్డినేటర్ సువర్ణ వినాయక్, ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలకులు రవిప్రకాశ్, డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. బోయినపల్లిలోని హైస్కూల్, వేములవాడఅర్బన్ మండలం నాంపల్లిలో కొనసాగుతున్న తొలిమెట్టు శిక్షణ శిబిరాన్ని గురువారం తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యం పెంచాలని సూచించారు. ప్రతీ విద్యార్థికి వర్క్‌బుక్స్, ఉపాధ్యాయులకు లెసన్‌ప్లాన్ బుక్స్ అందిస్తున్నట్లు తెలిపారు. క్వాలిటీసెల్ జిల్లా కో–ఆర్డినేటర్ శైలజ, ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, స్కూల్ కాంప్లెక్ హెడ్‌మాస్టర్ రంగనాథశర్మ పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు రాకుండా చూస్తాం

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



మాట్లాడుతున్న చిక్కాల రామారావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): విద్యుత్ సమస్యలు రాకుండా నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. కస్బెకట్కూర్ గ్రామం చింతలపల్లిలో గురువారం రైతులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాలతో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే సెస్ అధికారులకు తెలపాలన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తోపాటు వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకుడు చీమల ప్రశాంత్‌యాదవ్, జూపల్లి మల్లారావు, విష్ణు, లింగు రాములు, గున్నాల రాములు, పొన్నం వెంకటేశ్, నర్సయ్య, లచ్చయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

# డెంగీ నివారణపై ప్రత్యేక శ్రద్ధ

- డ్రై డే పక్కాగా అమలు చేయాలి
- కండ్లకలకపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



ప్రతిభ కనబర్చిన ఏఎన్‌ఎంలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: ప్రాణాంతక విషజ్వరం డెంగీ నివారణపై వైద్యశాఖ ప్రత్యేక శ్రద్ధ చూపెట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం సీజనల్ వ్యాధుల నివారణపై వైద్యశాఖ అధికారులతో సమీక్షించారు. డ్రై డే పకడ్బందీగా అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే పూర్తి ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. నెలలు నిండుతున్న గర్భిణులకు తరుచూ ఫోన్‌చేసి యోగక్షేమ సమాచారం తెలుసుకోవాలన్నారు. క్లినికల్ బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌తోపాటు ఆరోగ్య మహిళకు చేపడుతున్న ఎనిమిది రకాల నిర్ధారణ పరీక్షలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కండ్లకలక ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఏఎన్‌ఎంలకు ప్రశంసాపత్రాలు**

విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఏఎన్‌ఎంలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందించారు. ఏఎన్‌ఎంలు కృష్ణవేణి, మణెమ్మ, మంజుల, సరోజన, కవిత, రేణుక, మాధవి, రేనుక, ఆశవర్కర్లు సుజాత, సరోజ, సునీత, లక్ష్మి, లావణ్య ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అడిషనల్ కలెక్టర్‌లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, సూపరింటెండెంట్లు మురళీధర్‌రావు, మహేశ్ పాల్గొన్నారు.

**మానసిక రోగులకు ఆశా'కిరణం' కావాలి**

సిరిసిల్లలోని కిరణ కేంద్రం మానసిక రోగులకు ఆశా'కిరణం'గా నిలవాలని కలెక్టర అనురాగ్ జయంతి కోరారు. ఐడీవోసీలోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో కిరణం కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. డిప్రెషన్, నిరాశ, భయాందోళనలు, డిజార్డర్లు, మత్తుపదార్థాలు, మానసిక సమస్యలతో బాధపడే వారికి కిరణం కేంద్రంలో సేవలందించాలని ఆదేశించారు. జూలైలో కిరణం కేంద్రంలోని టోల్ ఫ్రీ నంబరు 1800 4253 333కు 30 కాల్స్ రాగా.. ఎనిమిది మందికి మెడికేషన్ అందించి మిగతా వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, డాక్టర్ నయిమా, డీడీఎం కార్తీకర్ తదితరులున్నారు.

# సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, గౌడ సంఘం నాయకులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని బైపాస్‌రోడ్డులో శాంతినగర్–నర్సింగ్ కళాశాల చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు గురువారం భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్, కన్వీనర్ బుర్ర నారాయణగౌడ్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుకు కృషిచేసిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈనెల 18న విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు బుర్ర లక్ష్మి, జాగిరు శైలు, గౌడసంఘం మహిళా అధ్యక్షురాలు అలేఖ్య, నాయకులు బొల్గం నాగరాజుగౌడ్, బండి దేవదాస్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, బండి శ్రీనివాస్‌గౌడ్, రామచంద్రంగౌడ్, కొండ రమేశ్‌గౌడ్, రామాగౌడ్, అజయ్‌గౌడ్, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, బుర్ర మల్లికార్జున్‌గౌడ్, సంతోష్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్, మల్లేశంగౌడ్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ


విద్యార్థులతో కరాటే మాస్టర్ దివ్య

**వేములవాడ:** ఈ నెల 2న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆల్ స్టైల్స్ కరాటే చాంపియన్‌షిప్‌లో వేములవాడకు చెందిన కుంగ్‌ఫూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం కరాటే మాస్టర్ దివ్య వారిని అభినందించారు. ఆర్థవ్, విష్ణుశ్, ఠాకూర్ గోల్డ్ మెడల్స్, ఉమెన్స్ విభాగంలో ప్రసన్న సిల్వర్ మెడల్, ఆయాన్ష్, మనోసాయిమిత్ర, సిద్ధాంత్, సుదీప్త సిల్వర్ మెడల్స్, బాలికల విభాగంలో ఐశ్వర్య, మన్విత గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. గ్రాండ్‌మాస్టర్ అమిత్, మాస్టర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

### హనుమాన్ ఆలయ హుండీ చోరీ

**రుద్రంగి(వేములవాడ):** మానాల, గైదిగుట్ట తండాకు వెళ్లే దారిలో అటవీ ప్రాంతంలోని హనుమాన్ ఆలయ హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పూజారి తెలిపారు. గురువారం ఉదయం పూజలు చేసేందుకు వెళ్లగా హుండీ కనిపించలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

**కోరుట్లపేట ఎల్లమ్మ ఆలయంలో..**

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** మండలంలోని కోరుట్లపేట ఎల్లమ్మ ఆలయంలో బుధవారం దొంగలు పడ్డారని గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఎల్లమ్మతల్లి పుస్తె, మెట్టెలు, బొట్టు బిల్లలు, కళ్లు, పావనం ఎత్తుకెళ్లారని అన్నారు. వీటి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### శివాలయంలో దొంగతనం


దొంగతనం చేసిన వ్యక్తి (సీసీ ఫుటేజీలో)

**సిరిసిల్లక్రైం:** సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌లోని శివాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. గురువారం తెల్లవారుజామును ఇద్దరు శివాలయంలోని హుండీని ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించినట్లు స్థానికులు సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. దీనిపై కృష్ణ అనే వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు, హుండీలో రూ.10 వేల నగదు ఉన్నట్లు తెలిపినట్లు తెలిసింది. దొంగలను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

### 9, 17న సదరం క్యాంపు

**సిరిసిల్లఅర్బన్:** సిరిసిల్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 9న సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. 9న వినికిడి, మానసిక, 17న ఆర్థోపెడిక్ నిర్ధారణ పరీక్షలు జరుగునని పేర్కొన్నారు. దివ్యాంగ పరీక్షలు చేసుకునే వారు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

# దేశాయిపల్లి 'గెజిట్'పై హైడ్రామా


దేశాయిపల్లి గ్రామసభలో అధికారులతో ప్రజల వాగ్వాదం (ఫైల్)


గ్రామ సమీపంలో అదనపు టీఎంసీ కాల్వ పనులు

- నిర్వాసితుల పీడీఎఫ్ ఫైనల్ జాబితాపై అనుమానం
- తహసీల్దార్ బదిలీకి ఒక్కరోజు ముందే కలెక్టర్ పేషీకి?
- గ్రామసభ నిర్వహించకుండా ఫైనల్ చేయడంపై ప్రశ్నలు

**బోయినపల్లి(చొప్పదండి):** అదనపు టీఎంసీ వరద కాల్వ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న బోయినపల్లి మండలంలోని దేశాయిపల్లి నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ పీడీఎఫ్ గెజిట్ పబ్లికేషన్‌పై హైడ్రామా కొనసాగుతోంది. ఇక్కడ పని చేసి, జగిత్యాల జిల్లాకు వెళ్లిన తహసీల్దార్.. తన బదిలీకి ఒక్కరోజు ముందే పీడీఎఫ్ గెజిట్ జాబితా ఫైల్‌ను వేములవాడ ఆర్డీవో కార్యాలయానికి పంపినట్లు.. అక్కడి నుంచి కలెక్టర్ పేషీకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. గ్రామంలో నిర్వాసితులతో గ్రామసభ నిర్వహించండా.. ఆర్‌అండ్‌ఆర్ కమిటీ ఆమోదం లేకుండా గెజిట్ జాబితా ఎలా తయారు చేస్తారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ విషయమే తనకు తెలియదని సర్పంచు ఒంటెల రాజగోపాల్‌రెడ్డి చెప్పడం గమనార్హం. ఇప్పటికే నిర్వాసితుల పీడీఎఫ్ ఫైనల్ జాబితా, ఆర్‌అండ్‌ఆర్ సమస్యలపై గ్రామంలో రెండుసార్లు ఏర్పాటు చేసిన గ్రామసభలు పలువురి ఆందోళనలు, నిరసనల మధ్య అర్ధంతరంగా ముగిశాయి. వరద కాల్వ నిర్మాణంలో గ్రామంలోని పలు ఇళ్లు, కొట్టాలు ముంపునకు గురవుతున్నాయి. బాధితులకు పరిహారం చెల్లించేందుకు గతంలోనే అధికారులు సోషల్ ఎకనామిక్ సర్వే చేపట్టారు.

**గ్రామసభ తీర్మానం లేకుండానే..**

ముంపునకు గురవుతున్న కుటుంబాలను ప్రాజెక్టు డిస్ ప్లేస్‌డ్ ఫ్యామిలీ(పీడీఎఫ్) అంటారు. గ్రామంలో అధికారులు చేపట్టిన క్షేత్రస్థాయి సోషల్ ఎకనామిక్ సర్వే ఆధారంగా పీడీఎఫ్ జాబితా సిద్ధం చేస్తారు. అనంతరం గ్రామసభలో చదివి, ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే గెజిట్ పబ్లికేషన్ చేసి, పంచాయతీ నోటీస్ బోర్డులో అంటిస్తారు. ఇదీ పీడీఎఫ్ గెజిట్ ప్రాసెస్. కానీ ఇదేదీ జరగలేదు. సుమారు 140 నుంచి 143 మంది పీడీఎఫ్ గెజిట్ జాబితా మూడు రోజులు క్రితం తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ పేషీకి వెళ్లినట్లు తెలిసింది. ఇందులో పేరు ఉన్నవారికే ఆర్‌అండ్‌ఆర్ ముంపు ప్యాకేజీ, పరిహారం వస్తాయి. అయితే గెజిట్ జాబితా పారదర్శకంగా ఉంటే గ్రామసభ తీర్మానం లేకుండా ఉన్నతాధికారులకు ఎలా పంపుతారని కొందరు అంటున్నారు.

**ఫైనల్ కాకముందే అధికారుల బదిలీ**

దేశాయిపల్లి గెజిట్ పబ్లికేషన్ ఫైనల్ కాకముందే నలుగురు తహసీల్దార్లు, ముగ్గురు ఆర్డీవోలు బదిలీ అయ్యారు. మొదట తహసీల్దార్ యుగంధర్, అనంతరం స్వాతి, కొద్ది నెలల క్రితం ఎం.ఏ.మాజిద్, ఇప్పుడు దర్పెల్లి నరేశ్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, లీల, పవన్‌కుమార్ బదిలీపై వెళ్లారు. ఇళ్లు కోల్పోతున్న ఒక్కో కుటుంబానికి రూ.6.60 లక్షలు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇంటి నిర్మాణం కోసం రూ.1.25 లక్షలు, 75 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు గతంలో నిర్వహించిన గ్రామసభలో అధికారులు తెలిపారు. గెజిట్ జాబితాలో పేరు ఉండి, 18 ఏళ్లు నిండినవారు అర్హులు కావడంతో ఒక కుటుంబంలో ఎంతమంది ఈ వయసు నిండిన వారుంటే వారందరికీ ప్యాకేజీ వస్తుంది అంటున్నారు. కానీ బోయినపల్లికి ఇప్పటికీ తహసీల్దార్‌ను నియమించక పోవడంతో గెజిట్ జాబితా విషయం అంతు చిక్కడం లేదు.

**గ్రామసభ నిర్వహించరా?**



గ్రామంలో పీడీఎఫ్ గెజిట్ జాబితా ఫైల్ ఆర్డీవో కార్యాలయానికి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. గ్రామంలో గ్రామ సభ నిర్వహించకుండా, ఆర్‌అండ్‌ఆర్ కమిటీకి తెలియకుండా గెజిట్ ఫైనల్ ఎలా చేస్తారు? దీనిపై అధికారులు సమాధానం చెప్పాలి.

– ఒంటెల రాజగోపాల్‌రెడ్డి, సర్పంచు, దేశాయిపల్లి

# కటకటాలకు సుపారీ హంతకులు

- ముగ్గురిని అరెస్టు చూపిన పోలీసులు
- మిస్సింగ్ కేసు ఆధారంగా విచారణ
- కేసు ఛేదించిన పోలీసులకు రివార్డులు


హత్య కేసును ఛేదించిన పోలీసు అధికారులకు రివార్డు అందించిన ఎస్పీ అఖిల్ మహాజన్

**సిరిసిల్లక్రైం:** సిరిసిల్లలో నివసిస్తున్న కూరగాయల వ్యాపారి రాందేని కాశయ్యను హత్య చేసిన భార్య కనకవ్వతోపాటు మరో ఇద్దరు ఏదుల నర్సయ్య, కావల్ల అభిలాశ్‌ను పోలీసులు కటకటాలకు పంపారు. జిల్లా కార్యాలయంలో హత్యకు సంబంధించిన వివరాలను ఎస్పీ అఖిల్‌మహాజన్ వెల్లడించారు. రాందేని కాశయ్య(65), భార్య రాందేని కనకవ్వ పాతికేళ్ల క్రితం సిద్దిపేట నుంచి సిరిసిల్లకు వలస వచ్చారు. కూరగాయల వ్యాపారం చేస్తూ బతుకుతున్నారు. మద్యానికి బానిసైన కనకయ్య భార్యను అనుమానిస్తూ వేధించేవాడు. వేధింపులు భరించలేని కనకవ్వ నెహ్రూనగర్‌లో ఉండే తమ్ముడు వరుస అయ్యే ఏదుల నర్సయ్యకు భర్త వేధింపుల గురించి చెప్పింది. రూ.3లక్షలకు కాశయ్యను హత్య చేసేందుకు ఒప్పుకున్నాడు. ఇందుకు తన స్నేహితుడు వెంకట్రావునగర్‌కు చెందిన అభిలాశ్‌ను సాయం తీసుకున్నాడు. ఇందుకు అతనికి రూ.50వేలు ఇస్తానని ఒప్పించాడు. గత జూలై 13న కనకవ్వ, నర్సయ్య, అభిలాశ్ కలిసి నిద్రలో ఉన్న నర్సయ్య మెడకు దుప్పటి బిగించి ఊపిరాడకుండా చేశారు. చనిపోయాడని నిర్ధారించుకొని మృతదేహాన్ని అభిలాశ్‌కు చెందిన కారులో మానేరులోని చెక్‌డ్యామ్ వద్ద పాతిపెట్టారు.

**మిస్సింగ్ కేసు ఫిర్యాదుతో..**

రాందేని కాశయ్య సోదరుడు రాందేని ఎల్లయ్య తన అన్న గత 15 రోజులుగా కనిపించడం లేదని ఈనెల 2న సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోదరుడి భార్య కనకవ్వపై అనుమానం ఉందని పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు కాశయ్య ఇల్లు ఉన్న ప్రాంతం, భార్య కనకవ్వపై నిఘా పెట్టారు. సాంకేతికత ఆధారాలతో హత్య చేసిన ముగ్గురిని గురువారం సాయంత్రం పట్టుకున్నారు. హత్యకు వినియోగించిన వస్తువులు, సెల్‌ఫోన్, రూ.20 వేల నగదు, కారును పోలీసులు సీజ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురిని జైలుకు తరలించారు.

**పోలీసులకు రివార్డు**

హత్య కేసును అతిత్వరగా ఛేదించిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ అఖిల్ మహాజన్ రివార్డు అందించారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సిరిసిల్లటౌన్ సీఐ బి.ఉపేందర్, హెడ్‌కానిస్టేబుల్ పుల్కం శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీకాంత్, జనార్దన్, గోపాల్‌ను అభినందించి, నగదు రివార్డు అందజేశారు.

# రైతుల సంక్షేమమే 'సహకార' లక్ష్యం


చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్ కృష్ణారెడ్డి

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక సహకార సంఘం పనిచేస్తుందని, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడానికి పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సహకార సంఘంలో గురువారం ఐదుగురు రైతులకు రూ.21.70 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలంటే వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలు డెయిరీ, గొర్రెలు, పట్టుపురుగులు, కోళ్ల పెంపకం వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. రుణాల మంజూరుకు కృషి చేసిన టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్‌చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు వెంకట నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సతీశ్, హసన్‌బాయి, శ్రీనివాస్, ప్రదీప్, నంది కిషన్, కార్యదర్శి కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

# గుడి మెట్లపై జీపీ కార్మికుల భిక్షాటన


గుడి మెట్లపై భిక్షాటన చేస్తున్న కార్మికులు


కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న రవిగౌడ్

**వేములవాడ:** కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం రాజన్న ఆలయ మెట్ల వద్ద భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం కనికరించడంలేదని, మీరైన సహాయం చేయండంటూ భక్తులు, గుడిమెట్లపై అడుక్కుంటున్న యాచకుల వద్ద ఆర్థిక సహాయం అడిగారు.

**కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి**

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ కోరారు. కార్మికులు 28 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఎల్లారెడ్డిపేటలో నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులకు గురువారం సంఘీభావం తెలిపారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు జక్కుల మహేందర్, గౌరవ అధ్యక్షుడు రేసు రాజయ్య, కార్మికులు నర్సయ్య, భారతి, లక్ష్మి, రాములు, లింగవ్వ, శంకర్, సాయి, దేవేందర్ పాల్గొన్నారు.

# పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

**చందుర్తి(వేములవాడ):** జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలతో పత్తి, వరి పంటలను వివిధ రకాల తెగుళ్లు ఆశిస్తున్నాయని, నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పత్తిలో వర్షపు నీరు నిల్వ ఉండి, వేరుకుళ్లు తెగులు ఆశిస్తుందన్నారు. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి, మొక్క చుట్టూ వేర్లు తడిసేలా పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే నిల్వ నీటిని కాల్వల ద్వారా బయటకు పంపించాలని సూచించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు 1 మిల్లీలీటర్ ప్రోపికొనజోల్ మందును లీటర్ నీటిలో కలిపి, పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగుల ఉధృతిని నివారించేందుకు 1.5 గ్రాముల ఎసిఫేట్ ద్రావణాన్ని లీటర్ నీటిలో కలిపి, లేదా 0.3 మిల్లీలీటర్ల ఇమిడాక్లోరోప్రిడ్‌ను లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. వరిలో కాండం తొలుచు పురుగు(మొగి పురుగు) నివారణకు నారుమడి దశలో ఉన్న నారు తీసే 7 రోజుల ముందు 2 గుంటల మడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను చల్లి, నీటిని అందులోనే ఇంకేట్లు చేయాలన్నారు. ముదురు నారు నాటేటప్పుడు నారు కొనలను తుంచివేయాలని, నాటువేసిన 10 నుంచి 15 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు 10 కిలోల చొప్పున లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు ఎకరాకి 8 కిలోల చొప్పున, లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4జి గుళికలు ఎకరాకు 4 కిలోల చొప్పున చల్లాలన్నారు. చిరుపొట్ట దశలో ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 ఈసీ 400 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 60 మిల్లీలీటర్లు ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు.

# 23 ఏళ్ల తర్వాత దొరికాడు

- భార్యను హత్య చేసిన కేసులో జీవితఖైదు
- పెరోల్‌పై బయటకు వచ్చి పరారీలో హంతకుడు
- టెక్నాలజీ ఆధారంగా పట్టుకున్న పోలీసులు
- అభినందించిన ఎస్పీ అఖిల్ మహాజన్


అరెస్టు చూపుతున్న సీఐ కృష్ణకుమార్

**వేములవాడరూరల్:** భార్యను హత్య చేసి జీవిత ఖైదు అనుభవిస్తూ పెరోల్‌పై బయటకొచ్చి 23 ఏళ్లుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న ఖైదీని వేములవాడ రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపిన వివరాలు. వేములవాడ రూరల్ మండలంలోని నమిలిగుండుపల్లికి చెందిన చంద్రగిరి లింగయ్య 2000 సంవత్సరంలో తన భార్యను హత్య చేసి జీవితఖైదు అనుభవిస్తున్నాడు. పెరోల్‌పై బయటకొచ్చి 23 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ఎల్లారెడ్డిపేట మండల పరిధిలో తిరుగుతున్నట్లు సాంకేతికత ఆధారంగా గుర్తించి పట్టుకుని జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. తప్పించుకున్న తిరుగుతున్న ఖైదీని పట్టుకోవడంలో కృషి చేసిన డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కృష్ణకుమార్, ఏఎస్సై లక్‌పతి, సిబ్బంది సంపత్, శ్రీనివాస్, ఎల్లాగౌడ్, అంజయ్యలను ఎస్పీ అఖిల్‌మహాజన్ అభినందించారు.

# పెండింగ్ 'డబుల్' ఇళ్ల బిల్లులు ఇప్పించాలి


వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

**ముస్తాబాద్(సిరిసిల్ల):** మండలంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల బిల్లులు ఇప్పించాలని ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ సభ్యుడు నర్సయ్య కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి వినతిపత్రం అందించారు. పోతుగల్, తుర్కపల్లి, ఆవునూర్, గూడెం, మద్దికుంట, తెర్లుమద్ది గ్రామాల్లో పలువురు లబ్ధిదారులతోపాటు కాంట్రాక్టర్లు డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు చేసుకుంటున్నారని తెలిపారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పోరాట ఫలితమే రుణమాఫీ


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటాలతో సీఎం కేసీఆర్ రైతులకు రుణమాఫీ చేశారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. ఆర్టీసీ కార్మికులను పర్మినెంట్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పడంతోనే సీఎం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజునాయక్, నాయకులు గంట బుచ్చగౌడ్, కొత్తపల్లి దేవయ్య, చెన్నిబాబు, గుండాటి రామ్‌రెడ్డి, తిరుపతిగౌడ్, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

# సీపీఎం నాయకుల విరాళాల సేకరణ


సిరిసిల్లలో భిక్షాటనతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

**సిరిసిల్లటౌన్:** వరద బాధితులు, పంటనష్టం రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ విమర్శించారు. సిరిసిల్లలో గురువారం విరాళాల సేకరణ చేపట్టి మాట్లాడారు. రాష్ట్రంలో యుద్ధ ప్రాతిపదికంగా వరద బాధితులకు సాయం అందించాలని కోరారు. ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు అందివ్వాలని కోరారు. కోడం రమణ, శ్రీరామ్ సదానందం, మోర అజయ్, రమేశ్‌చంద్ర, సురేశ్ ఉన్నారు.

### కంప్యూటర్ బోధకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**సిరిసిల్ల ఎడ్యుకేషన్:** జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో కంప్యూటర్ బోధకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రమేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ విద్యలో డిగ్రీ, సీ లాంగ్వేజ్, హెచ్‌డీఎంఎల్ పరిజ్ఞానం ఉండాలన్నారు. వారానికి 8 నుంచి 10 గంటలు బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందించాలని సూచించారు.

### రైతులు బీమా నమోదు చేయించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

**చందుర్తి(వేములవాడ):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబీమా పథకానికి రైతులు ఈ నెల 5లోపు నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ గురువారం ప్రకటనలో కోరారు. కొత్తగా నమోదు చేసుకునే రైతులు జూన్ 18లోపు రిజిస్ట్రేషన్ చేయించుకుని, పట్టాదారు పాసుపుస్తకం ఉండి 18 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు.

### ఇజ్రాయిల్ స్టడీటూర్‌కు నర్సయ్య


గడ్డం నర్సయ్య

**సిరిసిల్లటౌన్:** సాంకేతిక, ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న ఇజ్రాయిల్ దేశంలో సాగు విధానాన్ని పరిశీలించేందుకు రాష్ట్ర వ్యవసాయ, కోఆపరేటివ్ శాఖల ఆధ్వర్యంలో స్టడీటూర్ చేపట్టారు. టూర్‌కు ఆర్‌బీఎస్ జిల్లా కోఆర్డినేటర్ గడ్డం నర్సయ్య వెళ్లారు. ఆ దేశంలో ఈనెల 5 నుంచి 10 వరకు పర్యటించనున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా ఎలా చేయాలనే దానిపై స్టడీ చేయనున్నారు.

# మూలన వాహనాలు.. పేరుకున్న చెత్త


మరమ్మతు పేరిట సినారె కళామందిరంలో ఉంచిన చెత్త సేకరణ వాహనాలు


రాజన్న ఆలయం వద్ద అంబేడ్కర్ చౌరస్తాలో పేరుకుపోయిన చెత్త

**వేములవాడ:** వేములవాడ మున్సిపల్‌కు చెందిన చెత్త సేకరణ వాహనాలు మరమ్మతు పేరిట మూలన చేరాయి. కొన్ని నెలలుగా అవి సినారె కళామందిరంలోనే ఉంటున్నాయి. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీల్లో, ప్రధాన కూడళ్ల వద్ద చెత్త కుప్పలు పెరిగిపోయి, దోమలు, పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని ప్రజలు అంటున్నారు. తాము రోగాలబారిన పడతామని ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు వాహనాలకు మరమ్మతు చేయించి, చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే పర్యటనలు



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

**సిరిసిల్లఅర్బన్:** జిల్లాలో కురిసిన వర్షాలకు చెరువులు తెగి రైతులకు నష్టం వాటిల్లిందని, అన్నదాతలను పట్టించుకోకుండా రాజకీయ లబ్ధికోసమే రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పర్యటిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.కె.మహేందర్‌రెడ్డి విమర్శించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులకు గండ్లు పడి రైతులు నష్టపోయారన్నారు. చిన్నబోనాల చెరువు తెగి సిరిసిల్లలోని పలు కాలనీలు నీటమునిగాయని, కానీ వారిని పరామర్శించిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. వరద బాధితులను ఓదార్చే సమయం మంత్రి కేటీఆర్‌కు లేకపోవడం శోచనీయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పోలీసులు కండువా కప్పుకున్నా కార్యకర్తల పనిచేస్తున్నారని విమర్శించారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, ఆకునూరి బాలరాజు, పొన్నం పర్శరాములు, శ్రీకాంత్ గౌడ్, ఆరెపల్లి బాలు, శ్రీను, మంగ కిరణ్, చక్రవర్తి, దేవరాజు, పాల్గొన్నారు.